క్లుప్తంగా

నియామకం



కాంతారావు

భూపాలపల్లి రూరల్: దళిత హక్కుల పోరాట సమితి (డీపీహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడిగా మరాతీ కాంతారావును ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారపాక అనిల్ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా రాసపల్లి భద్రయ్య, ఉపాధ్యక్షులుగా నేరెళ్ల జోసెఫ్, పీక రవికాంత్, సహాయ కార్యదర్శులుగా పానగంటి లావణ్య, మంద రవీందర్ కోశాధికారిగా పెద్దమాముల సంధ్యతో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా..



రాజేందర్‌రెడ్డి

రేగొండ: కొత్తపల్లిగోరి బీజేపీ మండల అధ్యక్షుడిగా సూరిగురి రాజేందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హెలికాప్టర్‌లో ఈవీఎంల తరలింపు



కాళేశ్వరం: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఈనెల 19న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో మావోయిస్టు సమస్యాత్మక ప్రాంతాలకు మొదటిసారి హెలికాప్టర్ సేవలు వినియోగించారు. మంగళవారం గడ్చిరోలి నుంచి రెండు హెలికాప్టర్లలో 295 మంది ఎన్నికల సిబ్బందితో పాటు ఈవీఎంలు, సామగ్రిని తరలించారు. గతంలో దట్టమైన అటవీప్రాంతం కావడంతో కాలినడన, ఇతర ప్రైవేట్ వాహనాల్లో వెళ్లేవారు. అయితే ప్రస్తుతం మావోయిస్టుల సంచారంతో అక్కడికి వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో మొదటిసారి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు హెలికాప్టర్‌లో సిబ్బంది, ఇతర సామగ్రిని తరలించారు.

డీసీఎంను ఢీకొట్టిన లారీ



కాటారం: మిర్చి లోడ్‌తో ఆగి ఉన్న డీసీఎం వాహనాన్ని లారీ ఢీకొట్టిన సంఘటన మండలంలోని బయ్యారం క్రాస్ సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వేళ్తే.. మిర్చి లోడ్‌తో వ్యాన్ మహదేవపూర్ నుంచి వరంగల్‌కు వెళ్తుంది. బయ్యారం క్రాస్ సమీపానికి రాగానే వ్యాన్‌లో డీజిల్ అయిపోవడంతో పెట్రోల్ బంకు సమీపంలోని రోడ్డుపై డ్రైవర్ వాహనాన్ని నిలిపాడు. అటుగా భూపాలపల్లి నుంచి వస్తున్న లారీ గమనించకుండా అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో వాహనం ముందు భాగంగా నుజ్జునుజ్జు కాగా వ్యాన్ డ్రైవర్ స్వామికి తీవ్ర గాయ్యాలయ్యాయి. గమనించిన స్థానికులు స్వామిని చికిత్స నిమిత్తం భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గోవిందరావుపేట: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల పరిదిలోని పస్రా పరిధి అటవీ ప్రాంతంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. పరకాల మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన బొమ్మగాని శ్రీనివాస్, రాజ్‌కుమార్ కర్కగూడెం నుంచి వరంగల్ వైపు కారులో వస్తున్నారు. ఈ క్రమంలో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో శ్రీనివాస్ తలకు తీవ్ర గాయాలు అవడంతో పాటు కుడి కాలు విరిగింది. అదే విధంగా కుమార్ కుడి చేయి విరిగింది. క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తరలించారు.

అవగాహన సదస్సు

మంగపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు రైతు వేదిక కార్యాలయంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్న సదస్సులో ఎంపీడీఓ మాట్లాడారు. ప్రతి పాఠశాలకు అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్‌గా గ్రామైఖ్య సంఘం అధక్షురాలు, మహిళా పొదుపు సంఘం సభ్యులు ఈ కమిటీ సభ్యులుగా ఉంటారని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసిందన్నారు. మండలంలోని పాఠశాలల్లో మరమ్మతు పనులను చేపట్టేందుకు ఒక్కో పాఠశాలకు రూ.2లక్షల చొప్పున 20 పాఠశాలలకు నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.

ముస్తాబైన ఆలయాలు

- నేడు సీతారాముల కల్యాణం

భూపాలపల్లి అర్బన్: శ్రీరామ నవమిని పురస్కరించుకొని నేడు (బుధవారం) సీతారాముల కల్యాణ వేడుకలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించేందుకు రామాలయాలు, అంజనేయస్వామి దేవాలయాలు, ప్రముఖ ఆలయాలన్ని నిర్వహకులు సిద్ధం చేశారు. జిల్లా కేంద్రంలోని కొదండరామాలయం, శ్రీభక్తంజనేయస్వామి దేవాలయాల్లో, జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి వివిధ ఆలయాల్లో కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణానికి కావాల్సిన ఏర్పాట్లు చేశారు. భక్తులు హాజరై కల్యాణం వీక్షించే విధంగా పందిర్లు, టెంట్లు ఏర్పాటు చేశారు. వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ముస్తాబు చేశారు.

చిట్యాల: శ్రీరామ నవమి సందర్భంగా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు, మండలంలోని చల్లగరిగ, జడల్‌పేట, జూకల్, గుంటూర్‌పల్లి, నైన్‌పాక, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో శ్రీసీతారాముల కల్యాణ వేడుకలను సర్వం సిద్ధం చేశారు. ఆలయాల వద్ద భక్తులకు చలువ పందిళ్లు, టెంట్లు ఏర్పాటు చేసి, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.



చిట్యాల: గుంటూరుపల్లిలో కల్యాణానికి సిద్ధమైన ఆలయం

రేగొండ(కొత్తపల్లిగోరి): శ్రీ రామనవమిని పురస్కరించుకుని మండలంలోని ఆలయాలు సీతారాముల కల్యాణం కోసం ముస్తాబయ్యాయి. మంగళవారం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో రామాలయాలను విద్యుత్ దీపాలతో పాటు, చలువ పందిర్లతో సిద్ధం చేశారు. మండలంలోని రూపిరెడ్డిపల్లి, కొత్తపల్లిగోరి, నిజాంపల్లి, రావులపల్లి, రామన్నగూడెం, రేపాక గ్రామాలలోని రామాలయాలలో సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు చేశారు. వేసవి తీవ్రత పెరిగినందున భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

టేకుమట్ల: శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవానికి మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయాలు, కల్యాణ మండపాల్లో చలువ పందిళ్లు, టెంట్లు వేసి భక్తులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించారు.



రేగొండ: రామాలయంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు



టేకుమట్ల: కల్యాణానికి సిద్ధమైన వెలిశాల రామాలయం

రైతు నేస్తానికి స్పందన కరువు

రేగొండ: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులకు సాగులో మెలకువలతో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, నిపుణులతో క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం రైతు నేస్తం కార్యక్రమానికి రూపకల్పన చేసింది. రాష్ట్రంలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున ప్రతి మంగళవారం, శుక్రవారం రైతు వేదికల్లో దృశ్య శ్రవణ విధానంలో సాగులో అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో కార్యక్రమాన్ని చేపట్టింది. కాని, రైతులకు సరైన అవగాహన లేకపోవటంతో అనుకున్న లక్ష్యం నెరవేరేలా కనిపించడం లేదు. మంగళవారం రేగొండ రైతు వేదిక కార్యాలయంలో మట్టిలో సేంద్రీయ కార్బన్‌ను ఎలా పెంచాలి, వరి పంట కొయ్యకాళ్లను మట్టిలో కలపడం వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. రైతుల కంటే వ్యవసాయ అధికారులే ఎక్కువగా హాజరయ్యారు. ఇప్పటికైనా గ్రామాల్లో పూర్తి స్థాయిలో రైతునేస్తం కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని రైతులు కోరుతున్నారు.



రైతు నేస్తం కార్యక్రమంలో అధికారులు, రైతులు

బాల్యవివాహాలతో ఇబ్బందులు

ములుగు రూరల్: బాల్యవివాహాలతో అనేక ఇబ్బందులు తప్పవని చైల్డ్ హెల్ప్ లైన్ కేసు వర్కర్ రాంబాబు అన్నారు. మండల పరిధిలోని జాకారం గ్రామంలోని చెరువు వద్ద మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పని చేస్తున్న కూలీలకు బాల్య వివాహాలు, బాల కార్మిక చట్టాలు, బాలల హక్కులు, బాలలపై లైంగిక వేధింపులు, అక్రమ దత్తత చట్టం తదితర అంశాలపై బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో రాంబాబు మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించడమంటే బాలల హక్కులను హరించడమేనని అన్నారు. బడి బయటి బాలలను బాల కార్మికులుగానే పరిగణించడం జరుగుతుందని అన్నారు. బాల్యం ఎంతో అమూల్యమైన దశ అని, అమూల్యమైన బాల్యంలో పిల్లలంతా తమ హక్కులను స్వేచ్ఛగా అనుభవించేలా చూడటం మనందరి బాధ్యత అన్నారు. బాల కార్మిక నిషేధ క్రమబద్ధీకరణ చట్టం -2016 ప్రకారం 14సంవత్సారాల లోపు పిల్లలని ఎవరైనా పనిలో పెట్టుకుంటే వారి పైన చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సంతోష్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న బాలల సంరక్షణ విభాగం బాధ్యులు

ఉపాధి హామీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఏపీఓ హరీశ్

మల్హర్: మండలంలోని పెద్దతూండ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని ఉర చెరవులో ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో చేపడుతున్న ఫిష్ బ్రీడింగ్ పనులను ఏపీఓ గిరి హరీష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హరీష్ కూలీలతో మాట్లాడారు. కొలతల ప్రకారం ఉని చేస్తే ఒక్క రోజుకు రూ.300 చెల్లించడం జరుగుతందని తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పని ప్రదేశంలో కూలీలకు నీళ్ల, నీడ పందిరి, మెడికల్ కిట్ ఏర్పాటు చేయాలని సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రేగ రాజశేఖర్, ఫిల్డ్ అసిస్టెంట్ అజ్మీర సంతోష్ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో కాలయాపన

శాయంపేట : అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసిన ఆరు గ్యారంటీను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. పరకాల పట్టణంలోని జీఎంఆర్ గార్డెన్‌లో శాయంపేట మండల బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతితో కలిసి మంగళవారం ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టి 120రోజులు గడుస్తున్నా రూ. 2 లక్షల రుణమాఫీ, వరికి రూ. 500 బోనస్, మహిళలకు నెలకు రూ.2500, రైతు భరోసా రూ. 15000 పెట్టుబడి సాయం, ఇందిరమ్మ ఇళ్లు పథకాలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో అధిక స్థానాల్లో గెలిపించుకునేందుకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. తాను భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆలయ నిర్మాణం చేపడితే ప్రభుత్వ భూమిని అక్రమంగా తీసుకున్నట్లు ప్రచారం చేశారని, అధికారంలో ఉన్నవారు ఆధారలతో చూపెట్టాలని సవాల్ విసిరారు. తాను దిగజారుడు పనులు చేయమని న్యాయబద్ధంగా ఉంటామని తేల్చి చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మారెపల్లి సుదీర్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలను కోరారు. అంతకుముందు తెలంగాణ ఉద్యమకారుడు జలుగూరి రవీందర్ మృతిని చింతిస్తూ రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ రాంశెట్టి లతాలక్ష్మారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

శాయంపేట : మండలంలోని వసంతాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌లు ముక్కెర అనూష, దేవనాడి యశోద, మాజీ ఎంపీటీసీ కోసరి గోపాల్‌తోపాటు వార్డుసభ్యులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనాయణరావు, పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు, చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరుతున్నట్లు ఎమ్మెల్యే సత్యనారాయణరావు తెలిపారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు

అడవి రక్షణ అందరి బాధ్యత

పలిమెల: అడవిని రక్షించుకోవడం అందరి బాధ్యత అని మహదేవ్‌పూర్ ఎఫ్‌డీఓ వజ్రారెడ్డి అన్నారు. పలిమెల రేంజ్ సౌత్ జోన్ బీట్ బోడాయిగూడెం పరిధిలోని అడవికి కార్చిచ్చు అంటుకోగా ఎఫ్‌డీఓ వజ్రారెడ్డి, ఎఫ్ఆర్ఓ వెంకటేశ్వరరావు సమక్షంలో మంటలను అదుపు చేశారు. దీంతో మహాముత్తారం మండలం యత్నారం, నిమ్మగూడెం, పెగడపల్లి సౌత్ బీట్‌లలో కూడా అటవీకి అంటుకున్న మంటలను ఆర్పి వేసినట్లు తెలిపారు. కామనపల్లి వెస్ట్ పరిధిలోని ఏర్పాటు చేసిన సోలార్ బోర్‌వెల్ వల్ల వన్యప్రాణులకు నీటిని అందజేస్తున్నామన్నారు. అడవిలో వన్యప్రాణులకు నీరు అందిచడానికి సోలార్ వ్యవస్థతో పాటు వాచ్‌టవర్, కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు.



పలిమెల: మంటలు ఆర్పుతున్న అధికారులు



యంత్రాల సాయంతో ఆర్పుతున్న సిబ్బంది

మంటల నివారణకు చర్యలు

మహాముత్తారం: మండలంలోని పెగడపల్లి రేంజ్ పరిధిలోని యత్నారం, నిమ్మగూడెం, పెగడపల్లి అటవీ ప్రాంతాల్లో రెండు రోజులుగా అడవి అంటుకొని మంటలు వ్యాపిస్తున్నాయి. నిమ్మగూడెం, యామన్‌పల్లి ప్రధాన రహదారి వెంబడి అంటుకున్న మంటలను నిమ్మగూడెం పంచాయతీ కార్యదర్శి సిబ్బందితో వాటర్ ట్యాంక్ ద్వారా నీటిని సరఫరా చేసి మంటలను ఆర్పివేశారు. అదేవిధంగా పెగడపల్లి ఇన్‌చార్జ్ రేంజర్ ఆధ్వర్యంలో అటవీ శాఖ సిబ్బంది మంగళవారం యత్నారం, పెగడపల్లి అటవీ ప్రాంతాల్లో అంటుకున్న మంటలను ఫైర్ బ్లోయర్ ద్వారా ఆర్పివేశారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మహాముత్తారం: మంటలు ఆర్పుతున్న సిబ్బంది

చలివేంద్రం ప్రారంభం

రేగొండ: మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీనరసి ంహస్వామి దేవస్థానంలో వేసవి కాలం దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం ఆలయ కార్యనిర్వహణాధికారి మహేష్ మంగళవారం చలివేంద్రాన్ని ప్రారంభించా రు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు బుచ్చమచార్యులు, శ్రీనాథచార్యులు, ఆలయ సిబ్బంది రవీ ందర్, శ్రావణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఈఓ మహేష్

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

కాటారం: మండల కేంద్రంలో ఫిబ్రవరి 7న జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మ్యాక అభినవ్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం పర్కపల్లికి చెందిన జర్పుల రామకృష్ణ తన కుటుంబ సభ్యులతో కలిసి మేడారం వెళ్లి తిరుగుప్రయాణంలో కాటారం సెంటర్‌లో ఆగుతారు. అక్కడే ఉన్న జక్కు రాజేశ్, మారుపాక రిష్వింత్‌లను బెల్లంపల్లి వెళ్లుటకు దారి అడగగా వారు రామకృష్ణతో దుర్భాషలాడుతూ బండరాయితో దాడి చేస్తారు. దీంతో రామకృష్ణ తీవ్రగాయాలపాలవగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజేశ్, రిష్వింత్‌లపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. విచారణ నిర్వహించిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్స్ వేణు, లవన్, హోంగార్డు తిరుపతి ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కాటారం: మండలంలోని ధన్వాడ, శంకరాంపల్లి, గంగారం, విలాసాగర్, జాదారావుపేట గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం సీఈఓ ఎడ్ల సతీశ్ ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది అమీన్, రాజబాబు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈఓ సతీశ్



బీజేపీతోనే అవినీతి రహిత పాలన

భూపాలపల్లి రూరల్: దేశంలో అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యమని, పార్లమెంట్ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ప్రజలు ఓటేసి గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెన్నంపల్లి పాపయ్య కోరారు. మంగళవారం ఇంటింటి ప్రచారంలో భాగంగా బీసీ మోర్చా నాయకుడు కంబాల రాజయ్య ఆధ్వర్యంలో 16, 17, 18 పోలింగ్ బూత్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపయ్య మాట్లాడుతూ.. కరోనా నుంచి ఇప్పటి వరకు కూడా రేషన్ బియ్యం ఉచితంగా ఇస్తున్న ఘనత బీజేపీ ప్రభుత్వానిదే అన్నారు. దేశంలో మరోసారి మోదీ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నాగపూరి రాజమౌళి గౌడ్, దొంగల రాజేందర్, మండల రఘునాథరెడ్డి, నాంపల్లి కుమార్, చెక్క శంకర్, మాచనవేని రవీందర్, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రేగొండ: మోదీ పాలనలోనే దేశం సుభిక్షంగా ఉంటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగపూరి రాజమౌళి అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ ఎంపీ అభ్యర్థి ఆరూరి రమేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని మంగళవారం రేపాక, రాయపల్లి, తిరుమలగిరి గ్రామాల్లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దాసరి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ.. సామాన్య ప్రజలు సైతం మోదీని మరోసారి ప్రధానిని చేయాడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సుంకరి మనోహర్, బీజేవైఎం మండల అధ్యక్షుడు దయ్యాల కిరణ్, నాయకులు శ్రీనివాస్, నరేందర్, శోభన్, ప్రశాంత్, సంతోష్, దేశ్మి రాజు, సాంబయ్య, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లి రూరల్: ప్రచారంలో పాల్గొన్న నాయకులు



రేగొండ: ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

జయశంకర్ భూపాలపల్లి :
9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

ఎ. మహేష్ (S.R) : 9505555291
కె. సుధాకర్ (ACO) : 9177258410